


# భ్రమణం

పాలడుగు వెంకటేశ్వరరావు

ఆ ట్రెజరీ ఆఫీసు వరండాలో రెండు గంటలనించీ పడిగాపులు పడివున్నారు సూర్యనారాయణగారు. సూర్యనారాయణ గారు బడిపంతులుగా ముప్పయి సంవత్సరాలు సర్వీసుచేసి రెండేళ్ళక్రితం రిటయరయారు. ఆయన పెన్షను కాగితాలు ఇంకా ఆఫీసుల మధ్యన తిరుగుతూనే వున్నాయి. అటు తిరిగి ఇటు తిరిగి అవి నెల్లాళ్ళక్రితమే తిరిగి ట్రెజరీ ఆఫీసుకి వచ్చేయి. అందువలన ఆయన కాళ్ళకి బలపం కట్టుకుని రోజూ ట్రెజరీ ఆఫీసుచుట్టూ తిరుగుతూ వున్నారు. అయినా ఇంతవరకు ఆయన పెన్షను ఒక దారిన పడలేదు. పడవలసిన

మామూళ్ళు పడనందున ఆయన పని మూలనవేసిన గొంగళిపలె అలాగే వుండి పోయింది. పేదవాడి కోపం పెదవికి చేటు అని గ్రహించినందువలన ఆయన ఓపికకి పనిచెప్పి కాళ్ళకి బలపాలు కట్టుకొని తిరుగుతూనే వున్నారు. ఈ రోజున ఆయన ట్రెజరీ ఆఫీసరుగార్ని ఎలాగయినా కలుసుకోవాలన్న పట్టుదలతో నిరీక్షిస్తూ వున్నారు. ఆ నిరీక్షణ మొదలయి రెండు గంటలు పైనే అయింది.

అంతలో తలుపు తెరుచుకొని ట్రెజరీ ఆఫీసరుగారు గబగబ బయటకి వచ్చారు. ప్రక్కలకి తిరిగయినా చూడకుండానే గబగబ నడిచి వెళ్ళారు. అంతలోనే కారు బుర్రుమంది, చూస్తూవుండగానే తుర్రుమంది. సూర్యనారాయణ నోరు తెరచుకొని అలానే చూస్తూ వుండి పోయారు.

కాసేపటికి తేరుకొని ఎదురుగా వచ్చిన అటెండరును అడిగారు, తిరిగి అయ్యగారు ఎప్పుడు వస్తారు? అని. అటెండరు చిర్నవ్వు నవ్వి, వేదాంతిలా చెప్పాడు. 'వస్తారు. రాక ఎక్కడికి పోతారు సార్. నిదానించండి సార్. కల్సుకుందురుగాని' అని చెప్పి అతను తనదార్ని తను పోయాడు. సూర్యనారాయణగారు ఆ బెంచీమీదే కూర్చుండి పోయేరు. ఆయన కళ్ళు ఆ సరుగారి కోసం ఎదురు తెన్నులు చూస్తూనే వున్నాయి.

దయానందరావుగారు కారులో వెళ్తున్నారన్న మాటేగాని ఆయన మనసు మనసులో లేదు. ఉదయం ఆఫీసుకు వచ్చినప్పటినుంచి ఆయన తెగ చికాకుపడి పోయేరు. ఎవరెవరికో ఫోనుమీద ఫోను చేసేరు. ఆయన ఈవూరు ట్రెజరీ ఆఫీసరుగా వచ్చినప్పటినుంచి ఇంత చికాకు ఏరోజూ పడలేదు. ఆ క్రితం రోజు వారిసతీమణి ఆయనకి ఒక వార్త చెప్పి రాత్రంతా చెవిలో జోరీగలాగ గోలపెట్టి మరల ఉదయమే బద్ధకంతో లేచినప్పటినుంచి ఆయనతో రామరావణ యుద్ధం మొదలు పెట్టింది. ఆ బాధ పడలేక ఆయన కాఫీగూడ పుచ్చుకోకుండా ఆఫీసుకి వచ్చి హోటల్నుంచి తెప్పించుకుని తాగి అగ్గిరాముడయేడు. ఆ పిదప కనపడిన ప్రతి గుమస్తానీ కాల్చుకుని తిన్నాడు.

బయటి వాళ్ళకెవరికీ ఇంటర్వ్యూ ఇవ్వలేదు. ఆఫీసులో పనిచేసే అందరి మీదా విరుచుకుపడి అర్థమైన మాటలు అన్నాడు. ఆ మాటలు పడ్డవాళ్ళు చిరచిరలాడిపోయి అదంతా ఆ ఆఫీసుకి పనుండి వచ్చిన సూర్యనారాయణలాంటి వాళ్ళమీద చూపించేరు.

ఏమయితేనేం చివరకి పన్నెండు గంటల ఆ ప్రాంతంలో దయానందరావుగారి మొహంలోకి కొద్దిగా కళవచ్చింది. అందుక్కారణం ఆయనకి కావాల్సిన వ్యక్తి పానకాలరావుగారు పూర్ణించి అప్పుడే వచ్చారని తెలియటమే

పానకాలరావుగారు ఆ వూళ్ళో పేరు మోసిన మోతుబరి ఆయనకి నాలుగు పెద్దవ్యాపారాలు, రెండు సినిమాహాళ్లూ, మంచి పలుకుబడీ, కాలేజీలో చదివే బంగారు పిచుకవంటి కొడుకు వున్నారు. అతని పేరు ఆనందరావు ఆనందరావు దమయంతి అనే అమ్మాయిని ప్రేమించాడు. దమయంతీ అతని ప్రేమలో పడటం మూలాన ఆ ప్రేమ పెళ్ళి కాకుండానే తొందరపడింది. ఫలితంగానే దమయంతికి నెలతప్పింది. ఆదమయంతి ఆధాబాయిగారు గారాబంగా పెంచుకొన్న కూతురవటంవలన సంగతెలిసి ఆమె కంగారుపడి, కోపం తెచ్చుకుని కంగారంతా ఇంట్లోవాళ్ళమీద కోపమంతా భర్తఅయిన దయానందరావుమీదా చూపించింది. బావు కబురు గట్టిగానే చెవినేసి ఏం చేస్తావో చెయ్యి అని ఆయన్ని పయటికి తరిమికొట్టింది. అందువలన దయానందరావుగారు ఎలాగయినా పానకాలరావుని పట్టుకొని మాట్లాడి తన కూతుర్ని అతని కొడుక్కిముడిపెట్టాలన్న ప్రయత్నంమీద, పానకాలరావు వూర్నించి దిగాడని తెలియగానే రెక్కలు కట్టుకొని కారుమీద అతనింటికి బయలుదేరాడు గాని తీరా బంగళా గేట్లోనే ఎదురయిన ఆనందరావు ఇకిలించి "డాడీ లేరండి. అర్జంటుగా ఇప్పుడే టోపీరావుగారింటి కెళ్ళారు" అన్నాడు. ఆ మాటకి కోపం పొంగి వచ్చినా, 'ఓరి భ్రాష్టుడా, నా కూతురికి పెళ్ళి కాకుండానే కడుపుచేసికూడా కడుపులో కాఫీ కదలకుండా కూర్చున్నది నువ్వేగదా' అని లోలోపలె పళ్ళు కొరుక్కున్నా అదంతా దిగమింగుకుని చిర్నవ్వు నవ్వి 'అలాగా నాయనా' అని అతనిదగ్గర సెలవు పుచ్చుకొని క్షణం ఆలస్యం కాకుండా కారుని టోపీరావు ఇంటికి పొమ్మని డ్రైవరికి చెప్పగా అతను అలాగేనని ఆ పనే చేసాడు.

అయితే ఆదే క్షణాన టోపీరావు గేటుదగ్గర ఆగివున్న తన కొత్త మోడలు ఫియట్ కారులో కూర్చునివున్న పానకాలరావు చిందులు తొక్కాడు. పానకాలరావు స్టెయిన్ లెస్ స్టీలు కోటాకోసం అప్లయిచేసి ఆ పనిమీద నెల్లాళ్ళయి తిరుగుతూ వున్నాడు. ఆ సరదర్భంగా అతను టోపీరావుని స్వంతఖర్చుమీద మూడుసార్లు రాజధానికి తీసుకువెళ్ళి అన్ని ఏర్పాట్లుచేసి వున్నాడు ఆ కోటాగనుక వస్తే అప్పనంగా లక్షరూపాయల లాభం వచ్చిపడ్తుంది అయితే అతనికి తెల్సిన తాజావార్త ప్రకారం అ కోటాని మరొకడు తన్నుకు పోవటానికి సిద్ధంగా వున్నాడు. వెంటనే టోపీరావుని రాజధానికి తీసుకెళ్ళి చక్రం అడ్డు వెయ్యకపోతే రాబోయే లాభంలో నష్టం వచ్చి కొంపలు మునిగినంత పనవుతుంది. టోపీరావు లేడని తెల్సి ఆ కారణంవలన పానకాలరావు చిందులు తొక్కినంత పనిచేసి, పి. ఏ ద్వారా టోపీరావు కలెక్టరుగారి బంగళాకి వెళ్ళాడని తెల్సు

కుని కారుని అఘమేఘాలమీద ఆ దారి పట్టించాడు.

ఈలోగా కలెక్టరుగారి బంగళావద్ద టాక్సీలో కూర్చునివున్న టోపీరావు ఏంచెయ్యాలో తోచని పరిస్థితిలో ఘటనం జరిగింది. ఆ జిల్లాకి చెందిన మంత్రి గారు రెండు రోజుల్లో ఆ వూర్కి టూరుమీద వస్తున్నట్లు టోపీరావుకి ఆ రోజే తెల్సింది. ఆ క్రితం రోజువరకు ఢిల్లీ వెళ్ళి అనేకమయిన పనుల్లో మునిగి వున్నందువలన టోపీరావుగారు ప్రమత్త తలో వుండటం జరిగింది. టోపీరావు వచ్చే ఎన్నికల్లో ఎం. ఎల్.ఏ.గా పోటీ చెయ్యాలనుకుంటున్నారు అందుకు ఇప్పట్నుంచీ అండదండల్ని సంపా యించుకోవటం అవసరమని టోపీరావుకి తెల్సు. పార్టీటిక్కట్టే దొరక్కపోతే ఆ తర్వాత చేసేది ఏముంది। అందుకుగాను ఆ మంత్రిగార్ని పట్టుకోవల్సిన అవసరం వుంది. ఈలోగా టోపీరావు ప్రత్యర్థి ముందుగానే మేల్కొని మంత్రిగారి కార్యక్రమంలో తన 'హరిజన సేవా సమితి' ప్రారంభోత్సవం అనేదాన్ని ఇరికించేలా ఏర్పాటు చేసుకున్నాడు మంత్రిగారికి డిన్నరుకూడా ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తున్నట్లు తెల్సింది. ఈ కారణంవలన కలెక్టరుగార్ని పట్టు కొని ఇదివరకే అప్రూవు అయిన మంత్రి గారి కార్యక్రమంలో బాపూ సేవాసమితి వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఇరికించే ప్రయత్నంలో ఉరుకులు పరుగులు తీసే ఇదిలో వున్నారు టోపీరావుగారు.

ఆ కలెక్టరుగారు ఈ జిల్లాకి కొత్తగా వచ్చారు. ఒట్టి మొండిమనిషని ఎవర్నీ లెక్కచెయ్యడనీ అందుకనే కావాలని ఆయన్ని ఈ జిల్లాకి వేసారని తెలిసింది.

అదలా వుంచి కలెక్టరుగారు బంగళా లోలేరు. ఆ ఇదయమే లేచి వూళ్ళో కెళ్ళారని ఎక్కడికెళ్ళారో తెలీదని అడగ్గా జవాబురాగా టయిమంతా ఇలాగ వృధా అయితే ఇక అనుకున్న పని జరి పించటం కష్టమవుతుందే ఎలాగని దిగులుపడిపోయారు టోపీరావుగారు.

సర్లె. ఏంచేస్తాం. వెదుకుదాం పద మని టాక్సీని రోడ్లవెంట పట్టించారు టోపీరావుగారు.

ఈలోగా ఒంటి గంటయింది. ఇంకేం వస్తారు. ఆఫీసరుగారువస్తే ఇకసాయం త్రంగాని రారు అన్న అటెండరు మాటవిని, కడుపులో పేగులు గుడగుడ మనగా ఇంటిదారి పట్టారు సూర్యనారా యణగారు. నడవలేమని మొరాయి స్తున్న కాళ్ళకి బుద్ధిచెప్పి, ఎండలో వేపుడులో ముక్కలాగ వేగివేగి ఉస్సు రంటు ఇల్లు చేరారు చివరికి.

అప్పుడు వరండాలో కుర్చీలో కూర్చునివున్న వ్యక్తి లేచి నిలబడి 'నమ స్కారం మాష్టారూ? గుర్తున్నానా' అని పలకరించాడు. తెల్లమొహం వేసిన సూర్నారాయణగార్ని నవ్వి చూసి నేనండి రామచంద్రరావుని వానపాముల

స్కూల్లో మీదగ్గర చదువుకున్నాను. బసవయ్యగా రబ్బాయిని' అన్నాడు.

'నువ్వా బాబూ! ఎప్పుడు వచ్చావు? ఎలాగ వున్నావు? ఏం చేస్తున్నావు? అమ్మా నాన్నా కులాసా?' అంటు ఆనందంగా ప్రశ్నలు గుప్పిస్తూ లోపలికి వెళ్ళి గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి ఇచ్చారు. అది అందుకుని గటగట తాగి అమ్మ అమృతం ఇచ్చారు మాస్టారూ! ప్రొద్దుట్నుంచీ మీ ఇంటికోసం తిరిగి తిరిగి చివరికి ఎలాగైతేనేం పట్టుకున్నాను. నాన్నగారు మీరు ఈ వూళ్ళో వుంటున్నట్లు చెప్పారేగాని ఎడ్రసు ఇవ్వలేకపోయారు. అవునుగాని ఈ ఎండలో ఎక్కడికి వెళ్ళినట్లు!' అన్నాడు ఆప్యాయంగా.

"ఏం చెప్పమంటావుబాబూ కడుపు చించుకొంటే కాళ్ళమీద పడ్తుంది' అంటూ ఈ ముసలినంలో తనకి ఏ ఆధారం లేకుండాపోయిన సంగతీ, ఆ పెన్సను ఇంకా చేతికి అందకుండా వేధిస్తున్న వివరమూ అన్నీ ఏకరువు పెట్టారు సూర్నారాయణగారు.

అంతా విని తల పంచుకున్నాడు తను. కొన్ని నిమిషాల్లో మంచి చెడ్డ మాట్లాడాక చివాల్న లేచి నిలబడి వస్తా సార్. మళ్ళా కలుస్తాను" అంటూ గబగబ వెళ్ళిపోయేడు, తెల్లపోయిన సూర్నారాయణని వదిలేసి. పోతే అలాగ తిరిగి తిరిగి దయానందరావు పానకాలరావునీ– పానకాలరావు టోపీరావునీ - టోపీరావు కలక్టరుగార్ని కలక్టరుగారి ఆఫీసులో పట్టుకున్నారు ఆ రోజు ఒంటిగంటన్నరకి. టోపీరావు అందర్నీ కలెక్టరుకి పరిచయంచేసాడు.

"దయానందరావుగారు! మీ ఆఫీసులో ఎన్ని పెన్షనుకేసులు పెండింగులో వున్నాయి. ఎంతకాలంగా అవి అలాగ వున్నాయి. కారణాలు ఏమిటి ఇవన్నీ లిస్టు తయారుచేయండి. నేను మీ ఆఫీసుకి వచ్చి సాయంత్రం చెక్ చేయాలనుకుంటున్నాను" అని ఆర్డరు ఇచ్చి ఇంకేమీ మాటలకి అవకాశం ఇవ్వకుండా తన రూంలోకి వెళ్ళారు కలక్టరు. ఆ సాయంత్రానికే పెన్షను కాగితాలూ అంత వరకూ తనకు రావలసిన పెన్షను బకాయిలనూ గుమస్తా ఇచ్చి వెళ్ళగా ఇది కలా నిజమా అని ఆశ్చర్యపోతున్న సూర్నారాయణగార్ని ప్రక్కింటి పున్నయ్య అడిగాడు. "ప్రొద్దుట మీ ఇంటికి కలెక్టరుగారు వచ్చి వెళ్ళారట గదా" అని. సూర్నారాయణ ఆశ్చర్యపోయాడు అది విని.

"కలెక్టరా! లేదే!!" అన్నాడు సూర్నారాయణగారు.

"అవతల వీధిలో మా బంధువు – డిప్టీ తాసీల్దారు దూర్వాసరావు - కళ్ళారా చూసానని చెప్తుంటే..."

"పొన్నయ్యా. నువ్వు కలగాని కనలేదుగదా." అని పకపక నవ్వాడు సూర్నారాయణగారు "నీకేం పిచ్చి పట్టలేదుగదా" అనీ అన్నాడు. తెల్లబోవటం పున్నయ్య వంతయింది.